# మరవలేని మనిషి

ఆదివారం కాబట్టి మేట్నీకి ఓ ఇంగ్లీష్ సినిమాకి వెళ్ళాను. క్యూలో నిలబడ్డాను అతని వెనక.

కాళ్ళదగ్గర బ్రీఫ్‌కేస్ వుంది. ఇంగ్లీష్ నవలని చదువుతున్నాడతను. బుకింగు తెరిచాక చదవడం ఆపాడు.

వెనక్కి తిరిగి నన్నుచూసి వెంటనే నవ్వాడు "కులాసానా" అడిగాడు ఇంగ్లీష్‌లో.

అతన్ని చూడటం అదే మొదటిసారి.

"మీరెవరో నాకు తెలియదు" జవాబు చెప్పాను.

"మీరు ఆచారి తమ్ముడు కదా!" అడిగాడు.

తల అడ్డంగా వూపాను.

"కాదు?"

"సారీ."

"ఇట్సాల్‌రైట్"

మా ఇద్దరి సీట్లు పక్క పక్కనే. కూర్చున్నాక చెప్పాడు.

"ఆచారి అని నా స్నేహితుడొకడున్నాడు నాగపూర్‌లో. ఒకసారి అతని బ్రదర్ హైద్రాబాదునించి వచ్చాడు. అచ్చం మీలాగే వున్నాడు మీ పేరు?"

చెప్పాను.

"నాపేరు జీతూ జీతూ అగర్వాల్. నాగపూర్‌లో వ్యాపారము చేస్తున్నాను నెలకోసారి ఆ పనిమీద వస్తుంటాను" చెప్పాడు.

"నేను షెహన్‌సా కాంట్రాక్టర్స్ కంపెనీలో పనిచేస్తున్నాను" చెప్పాను.

సినిమా థియేటర్లో లైటారిపోయి తెరమీద స్లయిడ్స్ కనబడేదాకా చేతిలోని పుస్తకం చదువుతూండిపోయాడు అతను.

ఇంటర్వెల్‌లో కేంటీన్‌దగ్గర కనపడ్డాడు మళ్ళీ జీతూ. నాక్కూడా ఒక టీ తీసుకున్నాడు.

మొహమాట పడుతూనే తీసుకున్నాను.

“బాగా మబ్బుపట్టింది వర్షం వచ్చేటట్లుగా వుంది” అన్నాడు ఆకాశంవంక చూసి.

“సిగరెట్ తాగుతారా?” అడిగాను టీ తాగాక సిగరెట్ దుకాణము వైపు నడుస్తూ.

జేబులోంచి గోల్డుఫ్లాక్ సిగరెట్ పెట్టె తీసి నాకో సిగరెట్ ఆఫర్‌చేసి తనొకటి వెలిగించాడు. పొగ గుండెలనిండా పీల్చి వదులుతూ అడిగాడు.

“సినిమా అయేక మీకేమయినా పని వుందా?”

“ఎందుకు?”

“రాత్రి పదిన్నరకి దక్షిణ్ ఎక్స్‌ప్రెస్‌లో వెళుతున్నాను. వర్షం వస్తే సరదాగా విస్కీ తీసుకుందా మనుకుంటూన్నాను. కంపెనీ లేకుండా తీసుకోవటం కష్టమే. మీకు అలవాటుంటే సరదాగా కంపెనీ ఇవ్వగలరా?” మర్యాదగా అడిగాడు.

తలవూపాను. నా జేబులో ఇరవై రూపాయిలున్నాయి, వర్షంవచ్చే పక్షంలో అతని ఆలోచన మంచిదనిపించింది.

సినిమా అయేక బయటికి వస్తే సన్నగా తుంపరలు పడుతూ వున్నాయి.

“వెళదామా?” మొహమాట పడుతూనే అడిగాడు జీతూ.

తల వూపాను.

“థాంక్స్”

దగ్గరలో వున్న ఒక బార్‌కి వెళ్ళాం. బేరర్ వచ్చాక అడిగాడు నన్ను.

"మీరు నా గెస్టు. ఏం కావాలో చెప్పండి"

"మీరు?"

"బీరు తీసుకుంటాను నేను"

బేరర్‌కి కేజునట్స్‌కూడా తీసుకురమ్మని చెప్పాడు జీతూ.

"మీ వూరు బావుంటుంది" చెప్పాడు. నేను అట్టే మాట్లాడలేదు. అతనే వళ్ళ వ్యాపారం గురించి, నాగపూర్ గురించి, అక్కడ వున్న మహారాణిబాగ్ గురించి, తన కుటుంబం గురించీ అనేకం మాట్లాడ సాగాడు.

పావుగంటలో నా బీరు సీసా ఖాళీ అయింది. ఇంకొకటి ఆర్డర్ చేసాడు.

మరో అరగంటలో అది కూడా పూర్తయింది. తనకో క్వార్టర్ విస్కీ నాకో బీరు చెప్పాడు బేరర్‌ని పిలిచి.

"ఇక వద్దండీ" చెప్పాను. నా జేబులోని ఇరవై రూపాయల విలువని మించి తాగదలుచుకోలేదు. నా బిల్లు నేనే ఇవ్వదలుచు కున్నాను.

జేబులోంచి పర్సు తీసి తెరచి చూపించాడు జీతూ నవ్వుతూ.

పది రూపాయల నోట్లు చాలా వున్నాయి అందులో.

"లేదనుకోకండి. మీరు నా గెస్ట్. రైలుకి ఇంకా చాలా సమయం వుంది."

మూడో బీరు పూర్తయ్యేసరికి బాగా నిషా వచ్చింది నాకు.

"బాత్‌రూంకి వెళ్ళొస్తాను."

తల వూపాడు

టాయ్‌లెట్‌కి వెళ్ళి రెండు మూడు నిమిషాల్లో బయటకి వచ్చాను. జీతూ లేడు

బాత్‌రూంకి వెళితే నాకు ఎదురుపడి ఉండాలి దారిలో. బార్ అంతా చూసాను ఎక్కడా కనపడలేదు.

ఓ కొత్త వ్యక్తి కేవలం కంపెనీ కోసం ముక్కూ మొహం తెలియని నాకు వెందుకి ఖర్చు పెట్టాలి అన్న సంశయం నాలో ఎప్పుడో మొదలయింది.

లేచి అతని ప్రక్క సీట్ మీద వుంచిన బ్రీఫ్ కేస్ వుందో లేదో చూసాను.

ఉంది.

దాదాపు ముప్పావుగంట అయింది! జీతూ మళ్ళీ రాలేదు.

బేరర్ని పిలిచి అప్పటికే నాలుగైదు సార్లు అడిగాను అతన్ని గురించి. తనకి తెలియదన్నాడు.

లేచివెళ్ళి జరిగింది బార్ మేనేజర్తో చెప్పాను.

"మీ దగ్గర డబ్బులేదా?" అడిగాడు నా వంక అనుమానంగా చూస్తూ.

"లేదు. అతను బ్రీఫ్ కేస్ వదలి వెళ్ళాను. తప్పక వస్తాడు నేను వెళ్ళాలి."

కౌంటర్ వెనుకనించి లేచి ఆ బ్రీఫ్ కేస్ దగ్గరికి వెళ్ళాడు దాన్ని తెరచి లోపలికి చూసి నా దగ్గరకి తీసుకొచ్చి చూపించాడు మేనేజర్.

ఖాళీ!

"దీని ఖరీదు ఇరవై కూడా వుండదు."

నా మొహం పాలిపోయింది వెంటనే.

బార్ మూసేదాకా, రాత్రి పదకొండు దాకా చూసాను.

జీతూ వస్తాడనుకోలేదు.

రాలేదు కూడా.

నా వుంగరం మేనేజర్కి ఇచ్చి బయటికి నడిచాడు. దాన్ని తిరిగి తీసుకోవాలంటే జీతం వచ్చేదాకా ఆగాలి.